# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో చర్యలు తీసుకుంటాం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మే 2 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ హనుమంతరావు, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఏప్రిల్ 24నుంచి మార్చి 25వరకు అట్రాసిటీ కేసుల పరిష్కారం గురించి కమిటీ సభ్యులు, కమిటీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో నిరూపణ లేని కేసులపై స్పందించడం కమిటీ పనితీరుకు నిదర్శనమన్నారు. పాలనాపరంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రతినెలా అన్ని మండలాల్లో సివిల్ రైట్స్ డే జరుపాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో చార్జిషీట్ స్పీడప్‌గా ఉందని, జిల్లాలో విద్యా వ్యవస్థ మెరుగుపడాలని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి సహాయం అందించేందుకు ఎమ్మెల్యేల సహకారం తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వసంతకుమారి, డీఆర్డీఓ నాగిరెడ్డి, కమిటీ సభ్యులు బి.సుదర్శన్, ఎస్.శివలింగం, కె.నర్సింగరావు, బి.తిరుమలేశ్, బి.రాజన్‌నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, గ్రౌండ్ వాటర్ అధికారి జ్యోతికుమార్ పాల్గొన్నారు.

# నేతన్నల సంక్షేమం కోసం పలు పథకాలు

- రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్

భూదాన్ పోచంపల్లి, మే 2 : చేనేత కార్మికుల సంక్షేమ కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందని రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్య అన్నారు. పట్టణంలోని చేనేత సహకార సంఘంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ జియో ట్యాగింగ్ కలిగిన నేత కార్మికులు ఆర్డీ వన్ ఖాతాలో డబ్బులు జమ చేసుకుంటే ఆర్డీ టు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని అన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి రూ.18వేలు, అనుబంధ కార్మికుడికి రూ.6వేలు జమ చేసే పద్ధతి వచ్చే నెల నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు షోరూమ్‌లు ఏర్పాటు చేసి విక్రయానికి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో 57 సంవత్సరాల వరకే బీమా వర్తించేదని, ప్రస్తుత ప్రభుత్వం వయస్సుతో సంబంధం లేకుండా వృద్ధులైన వారికి రూ.5లక్షల బీమా వర్తింపజేస్తుందని తెలిపారు. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో అతిపెద్ద మ్యూజియం, ప్రొడక్షన్ డిజైన్, డయింగ్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని, వచ్చే నెలలో డీపీఆర్ తీసుకొస్తామని చెప్పారు. ఆమె వెంట హ్యాండ్లూమ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, హ్యాండ్లూమ్ ఏడీ శ్రీనివాస్ ఉన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు : సీపీఎం



దత్తప్పగూడెంలో మేడే ఉత్సవాల్లో పాల్గొన్న జాతీయ మానవ హక్కుల కమిటీ నాయకులు

మోత్కూరు, మే 2 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మండలంలోని పాలడుగు, పాటిమట్ల గ్రామాల్లో శుక్రవారం మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచడం లేదన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వాలకు కార్మికులు ఐక్యంగా ఉండి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, రాచకొండ కనకయ్య, కొంపెల్లి గంగయ్య, పిట్టల చంద్రయ్య, నాగరాజు, మెతుకు కృష్ణ పాల్గొన్నారు.

మండలంలోని దత్తప్పగూడెంలో జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అసంఘటిత రంగ కార్మికులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం జెండాను అవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల భిక్షపతి, నాయకులు తొంట నరేందర్, కోల మహేశ్, కార్మికులు పాల్గొన్నారు.

# రోడ్డుపై గుంతను పట్టించుకోరా? : సీపీఎం



శివారెడ్డిగూడెం గ్రామ శివారులో రోడ్డుపై గుంతను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్ పోచంపల్లి, మే 2 : మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామ శివారులో రోడ్డుపై గొయ్యి ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు మంచాల మధు అన్నారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న గుంతను పరిశీలించి మాట్లాడారు. నిత్యం ఇరు గ్రామాల ప్రజలు ఆ దారి వెంట ప్రయాణం కొనసాగిస్తుంటారని, గుంత వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. రోడ్డు మధ్యలో గుంత ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వదిలేశారని పేర్కొన్నారు. గ్రామస్తులే ఆ గుంతలో ఒక కర్రను పెట్టి ప్రమాద సూచికలా ఏర్పాటు చేశారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు నోముల కృష్ణారెడ్డి, శాఖ కార్యదర్శి వారాల మల్లారెడ్డి, నాయకులు వీరారెడ్డి, వెంకటేశం, లక్ష్మీనరసింహారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# '20న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి'

ఆత్మకూరు(ఎం), మే 2 : కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సామ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కప్రాయపల్లిలో శుక్రవారం వివిధ కార్మిక సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారన్నారు. కార్మికుల పని కాలాన్ని 8నుంచి 12గంటలకు పెంచి యాజమాన్యాలకు ఊడిగం చేయించాలని చూస్తున్న మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో స్వామి, ముత్తయ్య, రమేశ్, ప్రవీణ్, వెంకట్ పాల్గొన్నారు.

# గౌరాయిపల్లిలో పిడుగుపాటుకు గురై ఆవు మృతి

యాదగిరిగుట్ట, మే 2 : మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన భీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. వడగండ్ల వాన కురువడంతో పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి రహదారులపై పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. గౌరాయిపల్లిలో పిడుగుపాటుకు గురై బైర శ్రీనివాస్ ఆవు మృతి చెందింది. మండల వ్యాప్తంగా సుమారు గంటపాటు కురిసిన వర్షానికి విద్యుత్‌కు అంతరాయం కలిగింది.

# పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు కృషి

- రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



ఇక్కత్ పరిశ్రమపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

భూదాన్ పోచంపల్లి, మే 2 : భూదానోద్యమం, చేనేత వస్త్రాలకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భూదాన్ పోచంపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటుకు కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని పద్మశాలి సభా వేదిక వద్ద పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇక్కడ ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తే సార్థకత లభిస్తుందని, దానికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నామకరణం చేయాలని అన్నారు. హ్యాండ్లూమ్ పార్కులో అతిపెద్ద మ్యూజియం, ప్రొడక్షన్, డయింగ్, డిజైన్, ఎగ్జిబిషన్ సెంటర్‌గా పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. పోచంపల్లి మండలంలో పెండింగులో ఉన్న రైతు భరోసా నిధులను విడుదల చేస్తామని, సాంకేతిక సమస్యతో జాప్యం జరిగిందని చెప్పారు. చేనేతకు లక్ష రూపాయల వరకు రుణమాఫీపై మార్గదర్శకాలు జారీ చేశామని, 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య కాలానికి ఇది వర్తిస్తుందని తెలిపారు. నేతన్నల రుణమాఫీకి రూ.33కోట్లు కేటాయించామన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ త్రిఫ్ట్ స్కీమ్ కింద రాష్ట్రంలో రూ.270 కోట్లు మంజూరు చేయగా, జిల్లాకు రూ.90కోట్లు వచ్చాయన్నారు.

### పోచంపల్లి బ్యాంకు కేంద్ర కార్యాలయ నూతన భవనం ప్రారంభం

పట్టణంలోని పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కేంద్ర కార్యాలయ నూతన భవనాన్ని మంత్రి నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 11 బ్రాంచీలతో రూ.400 కోట్లకు పైగా టర్నోవర్ ఉండడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పరంగా పోచంపల్లి బ్యాంకుకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, బ్యాంకు అభివృద్ధికి స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే సహకరించాలని సూచించారు. అనంతరం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతి పితగా ప్రకటించాలని లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ చైర్మన్ రాపోలు జ్ఞానేశ్వర్ మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్, కలెక్టర్ హనుమంతరావు, అదనపు డైరెక్టర్ శ్రీనివాసరావు, జాయింట్ డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రావు, ఇందుమతి, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బి.పద్మ, హ్యాండ్లూమ్ ఏడీ శ్రీనివాసరావు, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, పోచంపల్లి బ్యాంకు చైర్మన్ రమేశ్, వైస్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, చేనేత నాయకులు వెంకటేశ్, మురళి, లవకుమార్, మల్లేశ్ పాల్గొన్నారు

# నీటి నిల్వ కందకాల ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కేంద్ర జలశక్తి అభియాన్ సీనియర్ సైంటిస్ట్ మాధవ్
- పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల పరిశీలన




తుర్కపల్లి : గోపాలపురంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ సీనియర్ సైంటిస్ట్ మాధవ్

తుర్కపల్లి, మే 2 : కొండలు, గుట్టల ప్రాంతాల్లో నీటి నిల్వను పెంపొందించేందుకు నీటి నిల్వల కందకాల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేంద్ర జలశక్తి అభియాన్ సీనియర్ సైంటిస్ట్ మాధవ్ అన్నారు. మండలంలోని గోపాలపురం, మాదాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొండలు, గుట్టల ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన కందకాలు, నీటి నిల్వ కందకాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుట్టలు, కొండల ప్రాంతాల్లో కందకాల ఏర్పాటుతో నీటి నిల్వలు పెరిగి భూగర్భజలాలు పెంపొందుతాయన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల రిపోర్టును కేంద్ర జలశక్తి సంఘానికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, వాటర్‌షెడ్ పీఓ ఇనాయక్ అలీ, ఏపీఓ లింగంపల్లి నర్సయ్య, ఈసీ యశోద, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్, జ్యోతి, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

### రాఘవాపురంలో..

ఆలేరు రూరల్ : మండలంలోని రాఘవాపురం గ్రామ పంచాయతీని కేంద్ర జలశక్తి అభియాన్ శాస్త్రవేత్త పి.మాధవ్ సందర్శించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2019–20 సంవత్సరంలో నాటిన మొక్కల ఎదుగుదలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ అరుణ, ఈసీ రాచచంద్రయ్యచారి, పంచాయతీ కార్యదర్శి తిరుమలాచారి, టీఏ మానస పాల్గొన్నారు.

# వికసించిన మే పుష్పాలు



ఆత్మకూరు(ఎం)లో విరబూసిన మే పుష్పాలు

ఆత్మకూరు(ఎం), మే 2 : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని పలువురి ఇండ్లల్లో మే పుష్పాలు వీరబూశాయి. అవి మంచి సువాసన వెదజల్లడంతోపాటు చూపరులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఈ పుష్పాలు సంవత్సరంలో నెల రోజులు మాత్రమే పుష్పిస్తాయి.

### ఆర్థిక సాయం

చౌటుప్పల్, మే 2 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన దాసరి మల్లయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహానికి మాజీ సర్పంచ్ ముటకుల్లోజు దయాకరాచారి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గ్యార కిష్టయ్య, నాయకులు రాజారత్నం, జిట్ట కృష్ణాయాదవ్, అస్లాం పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్




అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి, మే 2 : యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని పోచంపల్లి బ్యాంక్ నూతన కార్యాలయ భవన ప్రారంభం, చేనేత పరిశ్రమపై అవగాహన సదస్సుకు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్న సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌స్టేషన్‌కు తరలించారు. రూ.2 లక్షల వరకు చేనేత రుణమాఫీ చేయాలని, జియో ట్యాగ్ కలిగిన చేనేత కార్మికులకు చేనేత సహకార సంఘంలో సభ్యత్వం కల్పించాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలని ఇటీవల బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరినందున ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి గునిగంటి మల్లేశ్‌గౌడ్, భువనగిరి నియోజకవర్గ యూత్ విభాగం మాజీ కన్వీనర్ చింతకింది కిరణ్, చేనేత నాయకుడు కొంక లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

# భువనగిరిలో వడగండ్ల వాన

- ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు



బీఎన్ తిమ్మాపురంలో కూలిపోయిన సెల్ టవర్

భువనగిరి కలెక్టరేట్, మే 2 : మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఈదురుగాలులకు పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. బీఎన్ తిమ్మాపురం గ్రామపంచాయతీ వద్ద సెల్ టవర్ గాలికి కిందపడింది. రాయగిరి, తిమ్మాపురం, వడపర్తి, హనుమాపురం, కూనూరు, కేసారం తదితర గ్రామాల్లో ఈదురుగాలతో కూడిన వడగండ్ల వాన పడింది.

# ఇల్లు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారు.. న్యాయం చేయండి

- బాధితులు అగర్వాల్ హనుమంత్, గణేశ్, సంధ్య, లావణ్య



యాదగిరిగుట్టలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

యాదగిరిగుట్ట, మే 2 : తమ తండ్రి కొనుగోలు చేసిన ఇంటిని ఖాళీ చేయాలని పోలీసుల సహకారంతో పట్టణానికి చెందిన గోర్ల నర్సయ్య కుటుంబ సభ్యులు బెదిరింపులకు పాల్పడుతూ మానసికంగా ఇబ్బందులుకు గురిచేస్తున్నారని పట్టణానికి చెందిన బాధితులు అగర్వాల్ హనుమంత్, గణేశ్, సంధ్య, లావణ్య తెలిపారు. పట్టణంలోని వారి నివాసం వద్ద శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడారు. తన తండ్రి శంకర్ లాల్ 40 ఏండ్ల క్రితం యాదగిరిగుట్టకు బతుకుదెరువు కోసం వచ్చారన్నారు. పట్టణానికి చెందిన గోర్ల నర్సయ్య ఇంట్లో అద్దెకు ఉంటూ ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ సామాన్లు సేకరిస్తూ వ్యాపారం చేసుకుని జీవించేవాళ్లమని తెలిపారు. 2004లో గోర్ల నర్సయ్య వద్ద 90 గజాల భూమిని పెద్దల సమక్షంలో రూ.1.10లక్షలకు కొనుగోలు చేశామని, ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయమంటే జాప్యం చేశాడని అన్నారు. అనంతరం 15 ఏండ్ల క్రితం గోర్ల నర్సయ్య మృతి చెందాడని, కాలక్రమేణ తమ తండ్రి శంకర్‌లాల్ కూడా చనిపోయారని తెలిపారు. నాటి నుంచి తాము కొనుగోలు చేసిన స్థలంలోనే జీవనం కొనసాగిస్తున్నామన్నారు. నీళ్లు, కరెంటు బిల్లులు సైతం కుడుతున్నామని తెలిపారు. ఇటీవల నుంచి గోర్ల నర్సయ్య కోడలు ఇల్లు తమదే ఖాళీ చేయాలని పట్టణానికి చెందిన పలువురు పెద్దలు, పోలీసుల సహకారంతో బెదిరిస్తున్నారని చెప్పారు. ఈ విషయమై తాము కోర్టుకు వెళ్లామని చట్టపరంగా తమ హక్కుల కోసం పోరాడుతున్నామని అన్నారు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు విచారించాలని, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

# 'వడ్డె ఓపన్న విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి'



కరపత్రాన్ని విడుదల చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

తుర్కపల్లి, మే 2 : ఆలేరు పట్టణంలో ఏర్పాటు చేయనున్న వడ్డె ఓపన్న విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని వడ్డెర సంఘం మండల నాయకులు వల్లపు మహేందర్, ఓర్సు భిక్షపతి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్, శ్రీను, గణేశ్, నర్సింహులు, లక్ష్మయ్య, రమేశ్ పాల్గొన్నారు.

# శివన్నగూడెం, లక్ష్మణాపురం ప్రాజెక్టులతో 2లక్షల ఎకరాలకు సాగునీరు

- ఫ్లోరైడ్‌కు శాశ్వత పరిష్కారం చూపాలన్నదే కేసీఆర్ సంకల్పం
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్



శివన్నగూడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

మర్రిగూడ, మే 2 : మునుగోడు నియోజకవర్గంలో ఫ్లోరైడ్ భూతానికి శాశ్వత పరిష్కారం చూపాలన్నదే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంకల్పమని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. మండలంలోని శివన్నగూడెం ప్రాజెక్టును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఈ ప్రాంతంలో పాదయాత్ర చేసినట్లు గుర్తుచేశారు. ఆ సమయంలో ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులను చూసి చలించిపోయారన్నారు. ఆనాడే నిర్ణయించుకున్న ఆయన తెలంగాణ రాష్ట్రం వచ్చాక శివన్నగూడెం, లక్ష్మణాపురం ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రారంభించారని వెల్లడించారు. నిత్యం కరువుతో ఉండే మునుగోడు నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టుల ద్వారా 2లక్షల ఎకరాలకు పైగా సాగు నీరందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మిషన్ భగీరథతో ఫ్లోరైడ్ నీళ్లను తాగే దుస్థితి పోయిందని, ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఫ్లోరైడ్ రహిత భూగర్భజలాలు పంటలకు అందుతాయని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో శ్రద్ధ పెట్టి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ముంపు గ్రామాల బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గుండెబోయిన సత్తయ్య, ఎల్లంపల్లి శ్రీరామ్, అయోధ్య, మారగోని వెంకటయ్య యాదవ్ ఉన్నారు.

# మాద శంకర్‌కు మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి పరామర్శ



మాద శంకర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

వలిగొండ, మే 2 : మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన మాద శంకర్‌గౌడ్ ఇటీవల నిమ్స్ దవాఖానలో చికిత్స పొంది హైదరాబాద్ మల్లాపూర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శుక్రవారం శంకర్‌గౌడ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ఆయన వెంట మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, నాయకులు నెల్లుట్ల శ్రీనివాస్, లంబు శ్రీనన్న, అశోక్, ఆంజనేయులు, కుమార్, శ్రీకాంత్, శంకర్ గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, స్వామి, శ్రీను ఉన్నారు.

# అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం



అంబులెన్స్‌లో మహిళకు ప్రసవం చేసిన 108 సిబ్బంది

బీబీనగర్, మే 2 : మండలంలోని రాఘవాపురం గ్రామ పరిధిలో 108 అంబులెన్స్‌లో ఓ మహిళ ప్రసవించింది. ఈఎన్‌టీ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాపురం గ్రామంలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో పని చేస్తున్న సంగీత అనే మహిళకు పురిటినొప్పులు రావడంతో 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సంగీతను అంబులెన్స్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే కాన్పు చేశారు. సంగీత ఆడపిల్లకు జన్మనిచ్చిందని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎన్‌టీ తెలిపారు.

# పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని కార్తికను అభినందిస్తున్న ప్రముఖులు

ఆత్మకూరు(ఎం), మే 2 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొని 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని కార్తికను వ్యాపారవేత్త తొర్ర విష్ణువు, విద్యావేత్త పంజాల నర్సయ్యగౌడ్ శుక్రవారం సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

# తులం బంగారం ఎప్పుడిస్తరు?

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్‌కేపురం, మే 2: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన 420 హామీలు అమలు చేసేంత వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లకు మంజూరైన 99 కల్యాణ లక్ష్మి , షాదీముబారక్ చెక్కులను శుక్రవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రూ. 1,00,116 మాత్రమే ఇస్తున్నారంటూ.. తాము అధికారంలోకి వస్తే రూ. 1,00,116 లతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారన్నారు. తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేస్తామని పదేపదే చెబుతున్నదని, కోటి మంది మహిళల్లో ఏ ఒక్క మహిళా కోటీశ్వరురాలు కాలేదన్నారు.

# నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

సిటీబ్యూరో/మేడ్చల్, మే 2 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ నెల 4న నీట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాల్లో పరీక్షలు జరగగా 4336 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు అనుమతించి గేట్లను మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. పోలీసుల బందోబస్తుతో పాటు అన్ని పరీక్షా కేంద్రాల్లో మెడికల్ కిట్లు, అంబులెన్స్ ఏర్పాట్లను చేయనున్నారు. దివ్యాంగుల అభ్యర్థులకు వీల్‌చైర్ సౌకర్యం కల్పించేలా సంక్షేమాధికారిని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు.